క్లుప్తంగా

శివస్వాముల ప్రత్యేక పూజలు



ధరూరు: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో శివమాలధారులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. రమ్య ఇండస్ట్రీస్ అధినేత బండ్ల రాజశేఖరరెడ్డి ఆలయ ప్రాంగణంలో ధరూరు, మన్నాపురం గ్రామ శివస్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురు స్వాములు బోయ మల్లి, దర్శెల్లి, శివ స్వాములు సీతారాములు, రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

అలంపూర్: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి జ్యోతిర్లింగ దర్శనానికి కాలినడకన వెళ్తున్న శివభక్తులకు ఏబీసీడీఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అలంపూర్ చౌరస్తాలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా కర్నాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి శ్రీశైలానికి వెళ్లే శివస్వాములకు, పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు పట్టణంలోని వాసవీ రైస్‌మిల్ ఆవరణలో ఆదివారం అన్నదానం చేశారు. వెంకటాపురం నుంచి అడవి మార్గంలో శ్రీశైలం వెళ్లే పాదయాత్ర భక్తుల సౌకర్యార్థం నొప్పులకు, బలానికి, ఐరన్, విటమిన్, ఎసిడిటి మాత్రలు, నొప్పుల నుంచి ఉపశమనానికి క్రీములు, స్ప్రేలు, వివిధ సేవలు అందిస్తునట్లు ఆ సంస్థ ఫౌండర్ ఆకుతోట నర్సమ్మ తెలిపారు. కార్యక్రమంలో కో ఫౌండర్ విక్రమ్‌కుమార్, బత్తిని కుమార్, సంధ్యారాణి, ఉమ, ఉషారాణి, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి పాదయాత్ర

మానవపాడు: మండలకేంద్రంలోని శివమాలధారులు, భక్తులు ఆదివారం పవిత్ర పుణ్య క్షేత్రం శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరారు. మండల కేంద్రంలోని శివాలయంలో పండితులు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శివనామస్మరణ మార్మోగింది. గ్రామస్తులు అధిక సంఖ్యలో స్వాముల నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఇరుముడి ధరించి శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



మానవపాడు: మండలంలోని నారాయణపురం గ్రామ శివారు ప్రాంతంలో ఆదివారం ధ్వజస్తంభ, ఆంజనేయస్వామి విగ్రహం ప్రతిష్ఠాపనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరెందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నడిపి వెంకట్రాముడు, మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామసభ

రాజోళి: మండల కేంద్రంలో సోమవారం గ్రామసభ నిర్వహిస్తునట్లు పంచాయతీ కార్యదర్శి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు గ్రామసభ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అధికారులు దృష్టికి తీసుకురావాలని వివరించారు. వార్డు మెంబర్లు, అధికారులు హాజరవుతారని తెలిపారు.

ప్రహరీ నిర్మించాలి



మల్దకల్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పాఠశాల ఆవరణలోకి పశువులు, పందులు, మేకలు సంచరిస్తూ పాఠశాల పరిసరాలను అపరిశుభ్రంగా చేస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. అదే విధంగా పాఠశాల ఎదుట గద్వాల–అయిజ ప్రధాన రహదారి ఉండటంతో విద్యార్థులు రోడ్లపైకి వచ్చే సమయంలో వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయని, అధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పంట పెట్టుబడికి పరేషాన్

- భారంగా మారిన సాగు
- పెరిగిన ఎరువుల ధరలు



ట్రాక్టర్‌తో కరిగెట చేస్తున్న రైతు(ఫైల్)

కేటీదొడ్డి: రోజురోజుకు పెరుగుతున్న ధరలతో మండలంలోని సన్న, చిన్నకారు రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ పనిముట్లతో పాటు ఎరువులు ధరలతో రైతులు సతమతం అవుతున్నారు. సాగు చేసేందుకు కొంతమంది రైతులు వెనుకంజ వేస్తున్నారు. ధరల పెరుగుదలతో పంటల సాగు ఖర్చు అధికమవ్వడంతో గిట్టుబాటు కావడం లేదని మండల రైతులు వాపోతున్నారు. మండలంలో 16200 ఎకరాలలో వివిధ పంటలు సాగుచేశారు. మండలంలో 4800 చిన్నకారు, 3800 పెద్దకారు రైతులు ఉన్నట్లు వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. పంటల సాగు రైతులకు మరింత భారం మారింది. రోజురోజుకు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు రైతులను బెంబెలెత్తిస్తున్నాయి. వీటికి తోడు ఎరువులు, పురుగు మందుల ధరలు పెరగటంతో సాగు పెట్టుబడి మరింత భారం అయ్యింది.

డీజిల్ ధరల ప్రభావం

పెట్రోల్, డీజిల్ ధలర పెంపు ప్రత్యక్షంగా, పరోక్షంగా పంటల సాగుపై ప్రభావం చూపుతోంది. దుక్కులు దున్నటం, పురుగు మందుల పిచికారీ, ఎరువులు, కూలీల తరలింపు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు రైతులు పూర్తిస్థాయిలో ట్రాక్టర్లపైనే ఆధారపడుతున్నారు. డీజిల్ ధరల పెంపు కారణంగా ట్రాక్టర్ల కిరాయిలు పెంచారు. దీంతో పరోక్షంగా రైతులపై పెట్టుబడి భారం పెరిగింది. మరోవైపు ఎరువుల తయారీకి వినియోగించే ముడి సరుకు ధరలు పెరిగాయి. దీంతో 50 కిలోల బస్తాల ఎరువుల ధరను రూ. 250 నుంచి రూ. 500 వరకు పెంచారు. కాంప్లెక్స్ ఎరువులపై రాయితీలను తగ్గింపుతో ధరలు పెంచుతున్నారని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి 20 శాతం వరకు పెంచటంతో రైతులు దిగులు చెందుతున్నారు.

లక్ష మెట్రిక్ టన్నుల ఎరువుల వినియోగం

మండల వ్యాప్తంగా వానాకాలం యాసంగి పంటల సాగుకు రైతులు సుమారు లక్ష మెట్రిక్ టన్నుల ఎరువులను వినియోగిస్తున్నారు. ఇందులో కాంప్లెక్స్ ఎరువులు, డీఏపీ, యూరియా, పోటాష్ తదితర ఎరువులున్నాయి. ప్రస్తుతం 50 కిలోల డీఏపీ ధర రూ. 1400కు చేరింది. 20–20–013 ఎరువు ధర రూ. 1400కు చేరగా 14–35–14 రూ. 1500, 28–28–0 రూ.175కు 10–26–26కు రూ.1500కు చేరింది. పంటల సాగులో ఎరువుల కంటె పురుగు మందులకే ఎక్కువ పెట్టుబడులు పెడుతున్నామని సన్న, చిన్నకారు రైతులు పేర్కొన్నారు.

పెట్టుబడులు పెరిగాయి



పంటల సాగుకు పెట్టుబడులు పెట్టలేకపోతున్నాం. డీజిల్ ధరలు పెరగటంతో ట్రాక్టర్ల కిరాయిలు పెంచారు. ప్రస్తుతం ఎకరం సాగు చేసేందుకు సుమారు రూ.5 వేల వరకు పెట్టుబడి అవుతోంది. దీనికి తోడు ఎరువులు, పురుగు మందుల ధరలు కూడా పెరిగాయి. పంటల సాగు చేయాలంటే భయంగా ఉంది.

– స్వామి, రైతు, కేటీదొడ్డి

ఎరువులు కొనలేకపోతున్నాం



ఎరువుల ఖర్చు ఎక్కువవుతోంది. 50 కిలోల బస్తా రూ.1400 నుంచి రూ.1500 వరకు ఉంది. ఎరువులకే ఎకరాకు రూ. 10 వేల పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. పురుగు మందుల ధరలు కూడా రెట్టింపు అయ్యాయి. ధరల కారణంగా పంట గిట్టుబాటు రావడం కష్టమే.

– సద్దల వీరన్న, రైతు, కేటీదొడ్డి

అపూర్వ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

గట్టు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 2006–07 సంవత్సరంలో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం ఏ ఉద్యోగం చేస్తున్నారో, ఎక్కడ స్థిరపడ్డారో అడిగి తెలుసుకున్నారు. అప్పటి విద్యాబుద్ధులు నేర్పిన గురువులు అమరేష్‌బాబు, కృష్ణయ్య, వెంకన్న, భాస్కర్, మద్దిలేటి, శ్రీనివాసులు, నాగేష్‌బాబు, రామచంద్రరావు, శేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, జాఫర్‌లను ఘనంగా సన్మానించారు.

అంతర పంటపై రైతుల ఆసక్తి



చీని తోటల్లో అంతరపంటగా వేరుశనగసాగు

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల శివారులో పండ్ల తోటలను సాగు చేసిన రైతులు అదే పొలాల్లో అంతర పంటగా వివిధ రకాల ఆరుతడి పంటలను సాగు చేసుకుంటున్నారు. ఒకే పొలంలో రెండు పంటలను సాగు చేసుకుంటూ లాభాలను గడిస్తున్నారు. ప్రధానంగా చీని, మామిడి తోటల్లో అంతర పంటల సాగు ఈ మధ్య కాలంలో పెరిగింది. పండ్ల తోటల్లో వేరుశనగ, బొబ్బెర్లు వంటి ఆరుతడి పంటలను సాగు చేస్తున్నారు. అంతర పంటగా వేసిన సాగుతో లాభాలు వస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ధరూరు, మన్నాపురం, చింతరేవుల, వామన్‌పల్లి, పారుచర్ల, చిన్నపాడు తదితర గ్రామాల్లో అంతర పంటల సాగు అధికంగా ఆసక్తి కనబరుస్తున్నారు.

కంకర వేశారు.. బీటీ మరిచారు



పుల్లూరు- కలుగోట్ల మధ్య రహదారి

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు నుంచి కలుగోట్ల వయా మెన్నిపాడు వరకు బీటీ నిర్మాణంతో పాటు వంతెన ఏర్పాటు కోసం రూ.1.50 కోట్ల నిధులతో 2022 సంవత్సరంలో ఎంపీ రాములు పనులను ప్రారంభించారు. మొదట్లో రహదారి పనులు ముమ్మరంగా పనులు కొనసాగాయి. బీటీ పనుల్లో భాగంగా కంకర వేశారు. ఇంతవరకు బాగానే ఉన్న మిగతా పనులు కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశారు. దీంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. కంకర తేలిన రోడ్డుతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వంతెన, బీటీ నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



నాగర్‌దొడ్డి సమీపంలో కల్వర్టు వద్ద ఇలా..

మల్దకల్: మండలంలోని నాగర్‌దొడ్డి స్టేజీ సమీపంలో ఉన్న కల్వర్టు వద్ద సూచికబోర్డు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి సూచికబోర్డులను ఏర్పాటు చేయలేదని వాపోయారు. ప్రతి నిత్యం వందలాది వాహనదారులు ఈ రహదారిపై రాకపోకలు కొనసాగిస్తుంటారు. రాత్రివేళలో కల్వర్టు సమీపంలో ఉన్న గుంత కనిపించక అందులో పడి ప్రమాదాలకు గురైన సంఘటనలు కూడా అనేకం ఉన్నాయి. ఇప్పటికైనాఅధికారులు స్పందించి కల్వర్టు సమీపంలో సూచిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

గట్టు: మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ సమావేశపు హాల్‌లో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ చెన్నయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ విజయ్‌కుమార్ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలని కోరారు.

15న ధరూరులో..

ధరూరు: ఈ నెల 15న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ ఎండీ జబ్బార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ నజీమున్నీసా బేగం అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

సాట్స్ చైర్మన్ సోదరుడికి నివాళి



గట్టు: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ(సాట్స్) చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడు సోదరుడు నర్సన్‌గౌడు(53) అనారోగ్యంతో హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రితో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్మన్ సరిత, ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, వీఎం అజయ్, వడ్డేపల్లి జెడ్పీటీసీ రాజు, బల్గెర నారాయణరెడ్డి, సర్పంచు హనుమంతునాయుడు, క్రిష్టయ్యగౌడు, వెంకటస్వామిగౌడు, సీసీల వెంకట్‌రెడ్డిలు ఆలూరు గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. సాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడును పరామర్శించి ఓదార్చారు. అనంతరం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

విశారదన్ పాదయాత్రతో దళితుల్లో చైతన్యం



రాజోళి: దళితశక్తి ప్రోగ్రాం రాష్ట్ర వ్యవస్థాపకుడు డాక్టర్ విశారదన్ బీసీ, ఎస్సీ, ఎస్టీల స్వరాజ్య పాదయాత్రకు మండల కేంద్రంలోని ఆ సంఘం నాయకులు ఆదివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బహుజన నాయకుల ఫొటోలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నిషాక్ మాట్లాడుతూ బహుజనుల రాజ్యస్థాపనే ధ్యేయంగా యువత ముందుకు కదలాలని, అంబేడ్కర్, పూలే లాంటి మహాత్ముల అడుగు జాడల్లో నడవాలని అన్నారు. విశారదన్ చేస్తున్న పాదయాత్ర ద్వారా ప్రతి ఒక్కరిలో చైతన్యం కలుగుతుందని అన్నారు. పాదయాత్రకు మద్దతుగా కోటి సంతకాల సేకరణ చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం సభ్యుడు వీరేష్, డీఎస్పీ మండల అధ్యక్షుడు భాస్కర్, నరేష్, లక్ష్మణ్, నాగేంద్ర, రాజేష్, సత్య సూర్యుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

అలంపూర్: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు అన్నారు. ఆదివారం అలంపూర్ చౌరస్తాలోని బీఎస్పీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ బీఎస్పీ నాయకులు ప్రశ్నించే వరకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం కనిపించలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నాయకులు తుమ్మిళ్లపై సవతి ప్రేమ చూపించారని విమర్శించారు. అధికారం పోయాక కపట ప్రేమ చూపిస్తున్నారని దుయ్యబట్టారు. బీఎస్పీ పోరాటాలతోనే తుమ్మిళ్ల సాగునీరు వదిలారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధి చూపించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్, నాయకులు సుంకన్న, కనకం బాబు, లక్ష్మన్న, నాగరాజు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కేశవరావు

డీకే అరుణను కలిసిన నిర్వాసితులు



డీకే అరుణకు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసిత రైతులు

గట్టు: మండలంలోని చిన్నోనిపల్లె భూ నిర్వాసిత రైతులు ఆదివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న తరుణంలో చిన్నోనిపల్లె భూ నిర్వాసితుల గోడును బీజేపీ ఎమ్మెల్యేల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే విధంగా కృషి చేయాలని నిర్వాసిత రైతులు విజ్ఞప్తి చేశారు. చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను రద్దు చేయాలని ఏడాది కాలంగా ఐదు గ్రామాలకు చెందిన భూ నిర్వాసిత రైతులు ఆందోళన చేస్తున్నప్పటికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పట్టించుకోవడం లేదని వివరించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి, నిర్వాసిత రైతుల కమిటీ సభ్యులు వీరన్న, రామచంద్రగౌడు, శ్రీనివాసరెడ్డి, నర్సింహులుగౌడు, వీరశేఖర్‌గౌడు, నాగన్న, వీరేష్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్య కేంద్రం

మల్దకల్: మండలంలోని బిజ్వారం పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది. మరమ్మతు నోచుకోక గోడలు నెర్రలు ఏర్పడ్డాయి. 20 ఏళ్ల కిందట నిర్మించిన పశువైద్య కేంద్రం ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పశు వైద్య సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువైద్య కేంద్రానికి మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న బిజ్వారం పశువైద్య కేంద్రం

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న మిత్రులు

ఉండవెల్లి: మండల కేంద్రానికి మదన్మోహన్ అలియాస్ లడ్డు(38) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో 2003–04 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన అతడి స్నేహితులు మానవతాదృక్పథంతో ఆర్థికసాయం చేసేందుకు ముందుకు వచ్చారు. మొత్తం రూ.21 వేలు పోగు చేశారు. ఆదివారం బాధిత కుటుంబసభ్యులకు నగదును అందజేశారు. అదేవిధంగా బీజేపి జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్ రూ.6 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో తోటి స్నేహితులు ఇబ్రహీం, మహబూబ్, వెంకటేష్, వెంకటేశ్వర్లు గౌడ్, రాజు, రామాంజనేయులు, రవి, మధు పాల్గొన్నారు.

శాఖాహారం ఆరోగ్యం

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): ప్రతి ఒక్కరూ శాఖాహారం తీసుకోవాలని, దీంతో ఆరోగ్యంగా ఉంటారని పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి రోజుకు 4గంటల పాటు ధ్యానం చేస్తూ శ్వాసమీద ధ్యాస ఉంచాలన్నారు. ధ్యానం చేయడం వలన మనస్సు స్థిరంగా ఉండటంతో పాటు కొన్ని రోగాలను నుంచి విముక్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ హరి ప్రసాద్, రాధాకృష్ణ, రాములు, చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ సొసైటీ సభ్యులు

పందులను తరలించండి

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి గ్రామ పంచాయతీలో ఇళ్ల మధ్య స్వైరవిహారం చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పందుల పెంపకందారులు ఇష్టానుసారంగా గ్రామాలలో పందులను వదిలి వెళ్తున్నారని పలువురు పేర్కొన్నారు. దీంతో రోగాలబారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పందులను తరలించాలని పలుమార్లు స్థానిక అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. పందుల సంచారంతో నిత్యం కాలనీల్లో దుర్వాసన వస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పందులను తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

గట్టు: ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జోగుళాంబ గద్వాల బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కోరారు. ఆదివారం బోయలగూడెంలో ఆ పార్టీ స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. రైతులకు 24 గంటల కరెంట్, దళితులకు 3 ఎకరాల భూమి, పేదలకు ఇండ్లు హామీలు ఇచ్చి మోసం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేసి, పార్టీని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, ఫుల్‌టైమర్ రాజు, నాయకులు ఓంకార్, కృష్ణ, విరుపాక్షిరెడ్డి, అనిల్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.



హాజరైన కార్యకర్తలు

వృద్ధుడిపై కేసు నమోదు

ఉండవెల్లి: మైనర్ బాలికతో అసభ్యకరమైన సైగలతో ఇబ్బందిపెట్టిన వృద్ధుడిపై కేసు నమోదైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ బాలరాజు వివరాల ప్రకారం నంద్యాల జిల్లా డోన్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు వారి కుటుంబ సభ్యులు సర్కస్ చేసేందుకు మండలంలోని బొంకూరు గ్రామానికి చేరుకున్నారు. వీరి పెద్దకుమార్తె మైనర్ బాలికతో బొంకూరుకు చెందిన వృద్ధుడు బాలికను లోబర్చుకునేందుకు పిచ్చిపిచ్చి సైగలు చేశాడు. ఈ విషయం బాలిక తల్లిదండ్రులకు వివరించింది. వృద్ధుడి నిలదీసేందుకు బాధిత కుటుంబసభ్యులు వెళ్తుండగా అక్కడ నుంచి పారిపోయాడు. దీంతో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.